గురుకులాల అభివృద్ధికి కృషి



గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న దృశ్యం

కీసర: గురుకులాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ గురుకుల పాఠశాలను వారు సందర్శించి అక్కడ విద్యార్థులకు అందుతున్న వివిధ వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పంగ హరిబాబు, వెంకట్‌రెడ్డి, అన్నంరాజు సుమిత్రసురేష్, నేతలు శ్రీనివాస్, సత్యంసాగర్, షేక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుప్రీతి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ఏఐసీటీఈ, అటల్ సహకారంతో ఆరు రోజుల పాటు క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ పై నిర్వహించే ఎఫ్‌డీపీను జేఎన్‌టీయూహెచ్ కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడీ సుప్రీతి ప్రారంభించారు. వివిధ కళాశాలలకు చెందిన 105 మంది నమోదు చేసుకోగా వారిలో 60 మంది అధ్యాపకులను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథం తెలిపారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం ప్రసాద్, రాము, దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మినర్వ హైస్కూల్ డైరెక్టర్ రవికుమార్‌కు డాక్టరేట్



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని మినర్వ హైస్కూల్ డైరెక్టర్ వేల్పుల రవికుమార్ యాదవ్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. న్యూఢిల్లీలోని స్టాన్‌ఫోర్డ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం కాన్వకేషన్‌లో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పేద విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు, అనాథ పిల్లలకు రాయితీలో విద్యను అందిస్తున్నందుకు డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మినర్వ హైస్కూల్ కరస్పాండెంట్ అనురాధా, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియను పునఃప్రారంభించాలి

బోడుప్పల్: తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను పునఃప్రారంభించాలని ఫెడరేషన్ ప్రతినిధులు సోమవారం కమిషనర్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. చెత్త డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, ప్రజలు రోగాల భారిన పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో వర్మీకంపోస్టు, తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి సకాలంలో చెత్తను జవహర్‌నగర్‌కు తరలించేవారన్నారు. తిరిగి వర్మీ కంపోస్టును ప్రారంభించాలని, తడిచెత్త, పొడి చెత్తను పునః ప్రారంభించాలని వినతిపత్రంలో కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఫెడరేషన్ అధ్యక్షులు అబ్రహంలింకన్, కమిటీ సభ్యులు ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బోడుప్పల్: బోడుప్పల్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను సోమవారం మేడిపల్లి రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ.. సర్వేనంబర్ 63/1నుంచి 63/25 ఎస్సీల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెండు ఇళ్లు, రెండు బేస్‌మెట్స్ నిర్మించగా.. వాటిని జేసీబీతో కూల్చివేసినట్లు వివరించారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సిబ్బంది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల భద్రతే లక్ష్యం



ఉప్పల్‌లో నిర్వహించిన వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఉప్పల్: ఎల్‌పీజీ వినియోగదారుల భద్రతే తమ లక్ష్యమని, దాదాపుగా రూ.12 కోట్ల వినియోగదారులను కలిసే లక్ష్యంతో ఇంటింటి తనిఖీలు నిర్వహించినట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నోడల్ అధికారి నబీల్లా రెహమాన్ తెలిపారు. 'మన వంటగది మన భద్రత' అనే థీమ్‌తో సోమవారం ఉప్పల్ ఇండియన్ గ్యాస్ డీలర్ రమేష్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల సంయుక్తాధ్వర్యంలో గృహిణీలకు వంటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రూ.8 కోట్లమంది వినియోగదారుల ఇళ్లను తనిఖీ చేసి వారికి అవసరమైన తగ్గింపు ధరలకు గ్యాస్‌పైపును మార్చినట్లు వివరించారు. ఈ వంటల పోటీలు వినియోగదారులకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. పాతపైపులు, సురక్షితం కాని పైపులు వాడేవారు సురక్షితమైన పైపులను వాడుకోవాలని సూచించారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వచ్చిన నోడల్ అధికారిని నబీల్లా రెహమాన్, తేజేశ్వర్‌రావులు సురక్షితంగా రుచికరమైన వంటలు వండిన వారిని గుర్తించి వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు.

తుది దశకు సమగ్ర సర్వే

పూర్తి కావస్తున్న డోర్ లాక్ ఇళ్ల సర్వే

- వలస కుటుంబాలు స్థానిక ప్రాంతం వైపు మొగ్గుతో ఇబ్బందులు
- పలు అవాంతరాలతో సర్వే చేపడుతున్న ఎన్యుమరేటర్లు
- 55 శాతం పూర్తయిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ రూరల్ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తుది దశకు చేరింది. గత నెల 9న ప్రారంభమైన సర్వే ఇప్పటి వరకు 99 శాతం పూర్తయింది. ఒకటి, రెండు రోజుల్లో మొత్తం పూర్తికానుంది. మొత్తంగా 2800 మంది ఎన్యుమరేటర్లు, 242 మంది పర్యవేక్షకులు 21 రోజులుగా సర్వే చేస్తున్నారు. వాస్తవానికి నవంబర్ నెలాఖరులోగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉన్నా ఎన్యుమరేటర్లు పలు అవాంతరాలు, డోర్ లాక్ వంటి పరిస్థితుల నేపథ్యంలో ఒకటి, రెండు రోజులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. సమగ్ర సర్వే ఇంకా కొనసాగుతున్నా సంబంధిత వివరాల(డాటా)ను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది.

- మేడ్చల్ రూరల్ జిల్లా పరిధిలోని ఐదు మండలాలు ,13 పురపాలక సంఘాల్లో సర్వే కార్యక్రమం చేపట్టగా, ఇప్పటి వరకు ఐదు మండలాలు, 6 మున్సిపాలిటీల్లో దాదాపు వంద శాతం సర్వే పూర్తయిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లతోసహా పలు మున్సిపాలిటీల్లో సమగ్ర సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. డోర్ లాక్ ఇళ్లు ఉండటం వల్ల సర్వే చేయలేని పరిస్థితి నెలకొంది. వలస కుటుంబాల సంఖ్య కూడా అధికంగా ఉండటంతో వారంతా స్థానికంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నామని దాట వేస్తున్నట్లు ఎన్యుమరేటర్లు పేర్కొంటున్నారు. దీంతో సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు.

ప్రణాళికతో ముందుకు...

జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒక వైపు సమగ్ర సర్వే పనులు మరోవైపు ప్రభుత్వానికి సంబంధించిన ప్రాధాన్యత కార్యక్రమాలు ఉండటంతో కొంత ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. అయినా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లడంతో విజయవంతం అయ్యారు.

- సర్వేలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, జూనియర్ అసిస్టెంట్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ, మెప్మా సిబ్బందిసహా ఇతరులు కూడా భాగస్వామ్యం అయ్యారు. అయితే పల్లెల్లో సర్వేకు ప్రజల నుంచి పూర్తి సహకారం అందగా.. పురపాలికల్లో ఎన్యుమరేటర్లు కొంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు.
- పట్టణ ప్రజలు వారి సొంతూళ్లలోనే సర్వే చేయించుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇక పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు సమగ్ర వివరాలు ఇవ్వలేదని తెలుస్తోంది.

55 శాతం పూర్తయిన నమోదు ప్రక్రియ...

ఒకవైపు సర్వే పనులు కొనసాగుతుండగానే మరోవైపు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 55 శాతం సర్వే వివరాలను నమోదు చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకోసం కంప్యూటర్లు అధికంగా ఉన్న కార్యాలయాల్లో ఆపరేటర్లను నియమించి వివరాలు నమోదు చేయిస్తున్నారు. సర్వే పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని జిల్లా అధికార యంత్రాంగం సూచనలు చేసింది.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 2 నుంచి 15 వరకు లెప్రసీ సర్వే చేయాలని ఆశా వర్కర్లను ప్రభుత్వం నిర్దేశించిన క్రమంలో ఇప్పటికే పెండింగ్ ఉన్న బకాయిలను చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించిన ఆశా వర్కర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథ్‌స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి రేవతి కళ్యాణి మాట్లాడుతూ... మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆశా వర్కర్ల లెప్రసీ సర్వే, టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడీ పారితోషకాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఆశా వర్కర్లపై అధికంగా ఒత్తిడి పెంచే టార్గెట్లను తీసేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాళ్లు రాధ, యాదమ్మ, శంకరమ్మ, భాగ్యమ్మ, సరిత, శోభ, శశికళ, రాజ్యలక్ష్మి, ప్రవీణ, లలిత, కవిత, జ్యోతి, అనిత పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో...

లెప్రసీ సర్వే పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడీ బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం సంబంధిత జిల్లా వైద్యశాఖ అధికారులకు బీఆర్‌టీయూ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకుడు నంబు ప్రభాకర్, ఆశా వర్కర్లు మహాలక్ష్మి, ప్రేమలత, పద్మ, అనూష, దుర్గ, కవిత, సరస్వతి, రజిత, పుష్ప, జ్యోతి పాల్గొన్నారు.

నేడు జోడిమెట్ల చౌరస్తా వద్ద 'అర్బన్ డే'

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద మంగళవారం అర్బన్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటలకు జోడిమెట్ల చౌరస్తా నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ తీస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్వయం సహాయ బృందాల మహిళలకు రంగవల్లుల పోటీలు, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్: మేడ్చల్‌లో ఈ నెల 7, 8వ తేదీలలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్‌ను మేడ్చల్ పారిశ్రామిక వాడలో సీపీఎం నేతలు విడుదల చేశారు. మహాసభలలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామని సీపీఎం నేతలు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి నరేష్, నాయకులు నర్సింగ్‌రావు, ప్రశాంత్, చంద్రశేఖర్, నర్సింహ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



బింద్రేశ్ విశ్వకర్మ

మేడ్చల్‌రూరల్: బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్‌కుమార్ సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బింద్రేశ్ విశ్వకర్మ(35) ఆరేళ్ల క్రితం మేడ్చల్‌కు వలసవచ్చి మండలంలోని గౌడవెల్లి గ్రామంలో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 23వ తేదీన మేడ్చల్ చెక్‌పోస్ట్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన బింద్రేశ్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి



సాక్షి, సిటీబ్యూరో: వివిధ జిల్లా శాఖలలో ఆన్‌లైన్ పెండింగ్ అప్లికేషన్ల సంఖ్య పెరిగిపోతోందని, వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 72 అర్జీలను జిల్లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తీసుకున్నారు.

హైడ్రా అధికారుల పర్యటన



చింతల చెరువు ప్రాంతంలో పర్యటించిన హైడ్రా అధికారులు

బోడుప్పల్: చెంగిచర్ల చింతల చెరువు బఫర్ జోన్ ప్రాంతాన్ని హైడ్రా అధికారులు పర్యటించారు. ఓ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని ఇటీవల బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం హైడ్రా టీమ్ అడిషనల్ కలెక్టర్ సుధా, టీమ్ సభ్యులు హేమ, విజయ కుమార్ పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గతంలో 4.12 ఎకరాల స్థలంలో లేఅవుట్ చేసి విక్రయించారని, ప్రస్తుతం ఆయన నిర్మిస్తున్న బహుళ అంతస్తులు ప్రభుత్వ స్థలం పరిధిలో ఉన్నాయని వివరించారు. అన్ని విషయాలు తెలుసుకున్న హైడ్రా అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మేడిపల్లి తహసీల్దార్ హసీనా, బోడుప్పల్ టీపీఎస్ కావ్య, ఇరిగేషన్ ఏఈ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం



సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 3వ డివిజన్ పరిధిలో సోమవారం సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాపాలనలో భాగంగా 1,3వ డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బి- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్ మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఫార్మసిస్టుల నైపుణ్యాభివృద్ధికి శిక్షణ అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ యోగానందం

పోచారం: సర్టిఫికేషన్ కోర్సులతో ఫార్మసిస్టులు నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ బి.యోగానందం అన్నారు. సోమవారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఫార్మసీ కళాశాలలో పీఎంకేవీవై 4.0 పేరుతో రిజిస్టర్డ్ ఫార్మసిస్టులకు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఫార్మసిస్టులు వినియోగించుకోవాలన్నారు. అందుకు అవసరమైన శిక్షణను తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ... హోల్‌సేల్, రిటైల్ ఫార్మసీల బాధ్యతలను వివరించారు. దక్షిణాదిలో మొట్టమొదటిసారిగా పీఎంకేవీవై కార్యక్రమాన్ని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ... కళాశాలలో జన్ ఔషధి ఫార్మసీని త్వరలో ప్రారంభిస్తామన్నారు. కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, సౌత్ ఇండియా ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ క్లస్టర్ హెడ్ అమరేంద్ర బాబు, ఫార్మసీ డీన్ డాక్టర్ కృష్ణ మోహన్ చిన్నల, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థలను సందర్శించిన న్యూయార్క్ డీసీ



అక్షరాభ్యాస్ పలకలను పరిశీలిస్తున్న న్యూయార్క్ డీసీ దిలీప్ కుమార్ చౌహాన్

పోచారం: దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థలను న్యూయార్క్ మేయర్ ఆఫీస్‌లో డిప్యూటీ కమిషనర్‌గా సేవలందిస్తున్న దిలీప్ కుమార్ చౌహాన్ సోమవారం సందర్శించారు. నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్, ఇంజినీరింగ్ కాలేజ్, అక్షరాభ్యాస్ సంస్థల పనితీరును పరిశీలించారు. విద్యార్థుల అభివృద్ధికి యాజమాన్యం అవలంభిస్తున్న విధానాలను ప్రశంసించారు. అక్షరాభ్యాస్ సంస్థ ద్వారా నల్ల మల్లారెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. న్యూయార్క్‌లో విద్యార్థులకున్న పరిశోధన, ఉన్నత విద్యావకాశాలను వివరించారు. న్యూయార్క్ వచ్చే విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు అన్ని విధాల సహాయ సహకారాలను, సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి



ఎదులాబాద్‌లో మరమ్మతులు చేయిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో నూతనంగా విలీనమైన ఎదులాబాద్‌లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుద్ దీపాలు వెలగక రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. లోఓల్టేజీ సమస్యతో చెడిపోయిన విద్యుత్ లైట్ల స్థానంలో నూతన లైట్లను బిగింపజేశారు. గ్రామంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు కృషి చేస్తామని చైర్ పర్సన్ పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, జంగయ్యయాదవ్, అమర్, నర్సింహా, సత్తయ్యముదిరాజ్, రాజేందర్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న కొండల్‌రెడ్డి, సార శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: రైల్వే వంతెన నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ)అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, జహంగీర్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్‌గౌడ్ దీక్షలు చేపట్టగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతిగౌడ్, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, కిశోర్‌గౌడ్ సంఘీభావం తెలిపారు.

కేపీఆర్ఐటీ డైరెక్టర్‌గా సుధీర్‌బాబు



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కేపీఆర్ఐటీ) నూతన డైరెక్టర్‌గా బి.సుధీర్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా, ఏపీ స్టేట్ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీఆర్ఐటీ చైర్మన్, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఆ కళాశాల వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దివ్యశ్రీ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీనాథ్ కశ్యప్, హెచ్‌ఓడీలు, డీన్లు, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

సందడిగా ప్రజాపాలన విజయోత్సవాలు



మేడ్చల్ 23వ వార్డులో వీధులు శుభ్రం చేస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్లు



దమ్మాయిగూడలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి...

మేడ్చల్: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి సంవత్సరం పూర్తికావస్తున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన విజయోత్సవాలు రెండవ రోజు సోమవారం కొనసాగాయి. మేడ్చల్ మున్సిపాలిటీలో అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్ దీపికారెడ్డి, కౌన్సిలర్లు విజయోత్సవాల్లో పాల్గొన్నారు. వార్డులలో తెలంగాణ రైజింగ్ పేరిట వివిధ వార్డులలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో నాయకులు పాల్గొని వీధులను శుభ్రం చేశారు. ప్రత్యేకంగా శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమాల్లో కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు మహేష్, వాని రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో...

కీసర: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్‌లో సోమవారం మున్సిపల్ ఆఫీస్ నుంచి పి.ఎస్. రావ్‌నగర్ కమాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ ఎ.నాగమణి, డీఈఈ బాల మురళి, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు వెంకటేష్, రామారం శ్రీహరిగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, స్నేహ మహిళా సంఘాల ఆర్‌పీలు, స్నేహ మహిళా సంఘాల టౌన్‌మిషన్ కో ఆర్డినేటర్ ఇంచార్జ్ నరసింహా, స్నేహ మహిళా సంఘాల మహిళలు, అధ్యాపకులు పాల్గొన్నారు.